



గుంటూరులో ప్రథమ బహుమతి పొందిన చౌడం విజయలక్ష్మికి రూ.6వేల నగదు అందజేస్తున్న టీడీపీ సీనియర్ నేత కుర్రా అప్పారావు, ఆంధ్రజ్యోతి డీజీఎం సూదా రామచంద్రరావు



తెనాలిలో ప్రథమ బహుమతి పొందిన కే మానసకు రూ.6 వేలు అందజేస్తున్న మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్ సాంబశివరావు, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, కొడాలి వీరయ్య ట్రస్ట్ కన్వీనర్ వాసిరెడ్డి ప్రియబాంధవి



నరసరావుపేటలో ప్రథమ బహుమతి పొందిన కుమ్మరి చందనకు రూ.6 వేల నగదు అందజేస్తున్న శారదాంబ జ్యూయలర్స్ అధినేత నాగసరపు సుబ్బరాయ గుప్తా, అనురాధ దంపతులు



గుంటూరులో ప్రథమ బహుమతి సాధించిన చౌడం విజయలక్ష్మి వేసిన ముగ్గు



తెనాలిలో ప్రథమ బహుమతి పొందిన కే మానస వేసిన ముగ్గు



నరసరావుపేటలో ప్రథమ బహుమతి పొందిన కుమ్మరి చందన వేసిన ముగ్గు

ముగ్గులు మురిశాయి

- ఆంధ్రజ్యోతి ముగ్గులతో ఇలపై ఇంద్రధనుస్సు
- రంగవల్లులతో రంగులమయమైన ప్రాంగణాలు
- ముందుగానే సంక్రాంతి వచ్చేసిందన్నట్లుగా సందడి
- గుంటూరు, తెనాలి, నరసరావుపేట కేంద్రాల్లో పోటీలు
- చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పెద్దసంఖ్యలో హాజరు

రంగు రంగుల రంగవల్లులతో భూమాత పులకరించగా.. ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలతో ఇలపై ఇంద్రధనుస్సు ఆవిష్కృతమైంది. గుంటూరు, తెనాలి, నరసరావుపేట కేంద్రాల్లో పోటీలు జరగ్గా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు తీర్చిదిద్దిన ముగ్గులు మురిశాయి. ముందుగానే సంక్రాంతి వచ్చేసిందన్నట్లుగా ఆయా ప్రాంగణాల్లో సందడి నెలకొంది. గుంటూరులో పోటీలకు 220 మంది, తెనాలిలో 142 మంది, నరసరావుపేటలో 110 మంది వరకు హాజరై తమ ముగ్గు నైపుణ్యాన్ని ప్రదర్శించారు. సంప్రదాయ రీతిలో గొబ్బెమ్మలు.. గంగిరెద్దులు, నవధాన్యాలు, చెరుకుగడలు, పాలపొంగులు, హరిదాసులు, రైతుల బొమ్మలు, పూలతో అలంకరించిన ముగ్గులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సారి విద్యార్థినులు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా.. ఈ పోటీలతో మనదైన సంస్కృతి, సంప్రదాయాన్ని ఒక తరం నుంచి మరో తరం అందిపుచ్చుకునేలా ఆంధ్రజ్యోతి ఈ కార్యక్రమం నిర్వహించిందని అతిథులు, హాజరైన వారు అభిప్రాయపడ్డారు.

గుంటూరు(విద్య), తెనాలి అర్బన్, నరసరావుపేట కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముగ్గులను తీర్చిదిద్దేందుకు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఉత్సాహంగా ముందుకు రావడంతో ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన కనిపించింది. గుంటూరు, తెనాలి, నరసరావుపేటల్లో పోటీలు జరిగ్గా ఆయా ప్రాంతాల్లో సంక్రాంతికి ముందే పండుగ వాతావరణం నెలకొంది. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్ట్‌నర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్‌సెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు గుంటూరులో టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు, తెనాలిలో గణేష్ యూత్ అంగలకుదురు, నరసరావుపేటలో మాజీ మున్సిపల్ చైర్మన్, శారదాంబ జ్యూయలర్స్ అధినేత నాగసరపు సుబ్బరాయగుప్తా స్పాన్సర్లుగా వ్యవహరించారు. పోటీలు గుంటూరు, తెనాలి, నరసరావుపేట కేంద్రాల్లో జరిగినా చుట్టుపక్కల గ్రామాలతో పాటు సమీప జిల్లాలకు చెందిన వారు కూడా పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మంచు, చలిగాలులను సైతం లెక్క చేయకుండా పదుల కిలోమీటర్ల దూరం నుంచి మహిళలు ఉదయం 9 గంటలకే ఆయా కేంద్రాలకు చేరుకుని ఉత్సాహంగా ముగ్గులను తీర్చిదిద్దారు. ముగ్గులను తిలకించేందుకు ఆయా ప్రాంతాలకు చెందిన వారు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వివిధ కళాశాలల విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులపై మక్కువ చూపారు. సంప్రదాయాలను మేళవిస్తూ.. వినూత్నంగా.. విభిన్నంగా.. సందేశాత్మకంగా మహిళలు ముగ్గులను తీర్చిదిద్దడంతో విజేతల ఎంపికకు న్యాయనిర్ణేతలు శ్రమపడాల్సి వచ్చింది. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల నగదుతో పాటు కన్సొలేషన్ బహుమతులతో పాటు పాల్గొన్న వారందరికీ ప్రత్యేక గిఫ్టులను గుంటూరులో కుర్రా అప్పారావు, తెనాలిలో గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, నరసరావుపేటలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, అనురాధగుప్తాలు అందజేశారు. గుంటూరులో ఒకవైపు మహిళలు ముగ్గులు తీర్చిదిద్దుతూ తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు పోటీపడగా వారి పిల్లలు, మరికొందరు మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

మహిళా నైపుణ్యాలకు ముగ్గులు దర్పణం : కుర్రా అప్పారావు

గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు మాట్లాడుతూ మహిళల్లోని నైపుణ్యాలకు ముగ్గులు దర్పణంగా నిలిచాయని ప్రశంసించారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో తెలుగు లోగిళ్లలో పెద్ద పండుగైన సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా ముగ్గులు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సంస్కృతి, సంప్రదాయాల్ని ప్రోత్సహించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.

ముగ్గులతో ఆరోగ్యం : వీరవల్లి మురళి

తెనాలి బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పోటీ ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగింది. పోటాపోటీగా మహిళలు ముగ్గులు తీర్చిదిద్దడంతో నగదు బహుమతులతో పాటు ప్రత్యేకంగా పట్టుచీరలు అందజేశారు. గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి మొదటి ముగ్గురితో పాటు

(మిగతా 7వ పేజీలో)

విజేతలు

గుంటూరు
1. సీహెచ్ విజయలక్ష్మి
2. పీ.పూజిత
3. కే.చందన

కన్సొలేషన్: సునీత, శ్రీలత, మాధవీలత, గీజాంజలి, మాధవి

తెనాలి
1. కే.మానస
2. ఎస్.లక్ష్మీతిరుపతమ్మ
3. పీ.సాయిచైతన్య

నరసరావుపేట
1. కుమ్మరి చందన
2. ఏ.నాగజ్యోతి
3. పాపన సుజాత

కన్సొలేషన్ : మచ్చా మాధవి, బాపతు లావణ్య, గ్రంధి సురేఖ, మట్రం లక్ష్మీతిరుపతమ్మ



తెనాలి : బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



గుంటూరు : ఎన్టీఆర్ స్టేడియంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



నరసరావుపేట : ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రాంగణంలో ముగ్గులను తీర్చిదిద్దుతున్న మహిళలు



టీడీపీ నేతలపై దాడి చేసిన **తురకా కిశోర్ అరెస్టు**

-వివరాలు మెయిన్‌లో



సంక్రాంతికి గుంటూరు మీదుగా **ప్రత్యేక రైళ్లు**

7

ఒక్క రోజు తనిఖీలతో.. రూ.26.32 లక్షలు

- వాణిజ్య పన్నులశాఖకు స్వేచ్ఛ ఇస్తే ఇంకెంత ఆదాయమో?
- గ్రానైట్ అక్రమ రవాణాను అడ్డుకుంటే నెలకు రూ.కోట్లలో రాబడి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఒక్కరోజు తనిఖీలతో రూ.26.32లక్షల ఆదా యం. ఇదే రోజువారీగా చేస్తే.. అలా చేసేందుకు అధికారులు స్వేచ్ఛ ఇస్తే ప్రభుత్వ ఆదాయం రూ. కోట్లలో ఉంటుందా అంటే శనివారం నరసరావు పేటలో చోటుచేసుకున్న పరిణామాలు చూస్తే అవుననంటున్నా యి. పల్నాడు జిల్లా నుంచి గ్రానైట్ అక్రమ రవాణా పెద్దఎత్తున జరుగుతుండగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం అధికార పార్టీ నేతల జేబుల్లోకి వెళుతుంది. ఎటువంటి పన్నులు చెల్లించకుండానే ప్రతి నెల వందలాది లారీల గ్రానైట్ జిల్లా గుండా ఇతర రాష్ట్రాలకు తరలిపోతోంది. శనివారం జిల్లాలో విస్తృతంగా వాణిజ్య పన్నులశాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో గ్రానైట్ అక్రమ రవాణా గుట్టురట్టయింది. ఇతర రాష్ట్రా లను గ్రానైట్ రవాణా చేస్తున్న 14 లారీలను అధికారులు స్వాధీ నం చేసుకున్నారు. ఒక్కొక్క లారీ నిర్వాహకుడి నుంచి రూ.80 వేలు జరిమానా, అలాగే పన్నురూపంలో మరో రూ.15.12 లక్ష లు, వెరసి రూ 26.32లక్షలు వసూలు చేశారు. ఈ లారీలు బాప ట్ల జిల్లా మార్టూరు, బల్లికురవ గ్రానైట్ కంపెనీల నుంచి వచ్చిన ట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. పన్నులు చెల్లించకుండా మహారాష్ట్రకు తరలిపోతున్నాయని అధికారులు తెలిపారు.

మిన్నకున్న మైనింగ్ శాఖ

వాణిజ్య పన్నుల శాఖ అధికారులు లారీలను స్వాధీనం చేసుకున్న సమాచారాన్ని మైనింగ్‌శాఖకు తెలిపారు. లారీల్లోని గ్రానైట్‌కు రాయల్టీ చెల్లించారా లేదా అన్న అంశాన్ని మైనింగ్ శాఖ పరిశీలించాలి. లారీల్లో గ్రానైట్ కొలతలు తీసి రాయల్టీ వసూలు చేయాలి. అయితే సదరు అధికారులు ఆదివారం వరకు కూడా చర్యలు తీసుకోకుండా మిన్నకున్నారు. లారీల్లోని గ్రానైట్ పరిశీలనకే మైనింగ్ శాఖ అధికారులు పరిమితమయ్యారు. కొలతలు తీసి రాయల్టీ వసూలు చేసే ప్రయత్నం చేయకపోవడంతో విమర్శలకు దారితీసింది.

అధికారులపై ఒత్తిళ్లు

వాణిజ్య పన్నుల శాఖ స్వాధీనం చేసుకున్న లారీలను వదిలేయాలని కొందరు నేతలు అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెచ్చినట్టు సమాచారం. జాయింట్ కమిషనర్ ఆదేశాలతో తనిఖీలు నిర్వహించిన అధికారులు నేతల ఒత్తిళ్లకు తలొగ్గకుండా జరిమానాలు విధించారు. గ్రానైట్ అక్రమ రవాణాకు సహకరిస్తూ కొందరు నేతలు నెలకు రూ.లక్షల్లో ఆదాయాన్ని పొందుతున్నారనే ఆరోపణలున్నాయి.

రోజూ 60 లారీల్లో గ్రానైట్ అక్రమ రవాణా

పల్నాడు జిల్లా నుంచి గ్రానైట్ అక్రమ రవాణా పెద్దఎత్తున జరుగుతోంది. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం పక్కదారి పడుతోంది. ఎటువంటి పన్నులు చెల్లించకుండానే నిత్యం 50 నుంచి 60 లారీల గ్రానైట్ తెలంగాణ, మహరాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాలకు తరలిపోతోంది. ఏటా రూ.15 నుంచి రూ.20 కోట్ల వరకు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నట్లు సమాచారం. ఇంత పెద్దఎత్తున అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు కార్యాలయాలకే పరిమితం కావాల్సిన పరిస్థితి ఉంది. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు రోడ్డుపైకి వచ్చి తనిఖీలు చేసే స్వేచ్ఛలేదు. ఈ క్రమంలో ప్రభుత్వానికి గ్రానైట్ పన్ను ఆదాయం 90 శాతానికి పైగా తగ్గిందని ఓ అధికారి తెలిపారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కోటప్పకొండ మీదగా నరసరావుపేట బైపాస్ రోడ్డుకు రాత్రి వేళ గ్రానైట్ లారీలు చేరుకుంటాయి. అక్కడ నుంచి లారీలను రాష్ట్ర సరిహద్దులు దాటించే ముఠా రంగంలోకి దిగి డ్రైవర్లకు టోకెన్లు ఇస్తారు. టోకెన్ ఉన్న లారీని ఎక్కడా ఎవరూ ఆపరని ఎవరైనా ఆపితే తాము చూసుకుంటామని సదరు ముఠా భరోసా ఇస్తుంది. ఏ అధికారైనా టోకెన్ ఉన్న లారీని ఆపితే సదరు ముఠా రంగంలోకి దిగి సురక్షితంగా రాష్ట్ర సరిహద్దు దాటిస్తోంది. గ్రానైట్ అక్రమ రవాణా వైపు కన్నెత్తి చూసే పరిస్థితులు ఇక్కడి అధికారులకు లేదంటే అక్రమ దందాకు ఏ స్థాయిలో నేతల అండదండలు ఉన్నాయో తెలుసుకోవచ్చు.

వాణిజ్య పన్నులశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న గ్రానైట్ లారీలు



బాపట్లలో నేడు ముగ్గుల పోటీ

- మున్సిపల్ హైస్కూల్ వెనుక రోడ్డులో ఏర్పాట్లు
- పోటీలను ప్రారంభించనున్న కలెక్టర్ వెంకటమురళి

(బాపట్ల - ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో బాపట్లలో సోమవారం ముత్యాల ముగ్గుల పోటీలు జరగనున్నాయి. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్ట్‌నర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో కర్లపాలెం మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు, జీఎస్ఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుండ్రెడ్డి శివ ఆధ్వర్యంలో బాపట్ల మున్సిపల్ హైస్కూల్ వెనుక ఉన్న రోడ్డులో ముగ్గుల పోటీలు జరగనున్నాయి. పోటీలను కలెక్టర్ వెంకటమురళి ప్రారంభించనున్నారు. పేర్లు నమోదు చేసుకున్న మహిళలు ఉదయం 8 గంటలలకు పోటీల ప్రాంగణానికి చేరుకోవాలని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.6 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు అందచేస్తామని తెలిపారు. ముందస్తుగా ఫోన్లో పేర్లు నమోదు చేసుకోని వారు కూడా నిర్ణీత సమయంలో ప్రాంగణానికి వచ్చి పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. పోటీల్లో మహిళలు, యువతులే పాల్గొనాలని, చుక్కల ముగ్గులు మాత్రమే వేయాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అవసరమైన ముగ్గులు, రంగులు, ఇతర సామగ్రి పోటీదారులే తెచ్చుకోవాలన్నారు.



పోటీలు జరిగే ప్రాంగణంలో సిద్ధమైన వేదిక



ఇంటి యజమాని మద్యానికి బానిసైతే ఆ కుటుంబం అనుభవించే బాధ వర్ణనాతీతం.. అలాంటి నరకాన్ని ఎన్నో ఏళ్ళు అనుభవించారు చెన్నైకి చెందిన భాను సురేష్‌బాబు. కష్టనష్టాలు భరించి, ఓర్పుతో, నేర్పుతో తన భర్తను మార్చుకున్నారు. తన దుస్థితి మరే మహిళా అనుభవించకూడదనే ఆలోచనతో... డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి... వందలాదిమందికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు. స్ఫూర్తిమంతమైన భాను జీవన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...

మత్తు వదిలిస్తున్నారు

"మా వారు స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేసేవారు. చీఫ్ మేనేజర్‌గా రిటైరయ్యారు. అయితే మా పెళ్లయిన కొత్తలో ఆయన రేయింబవళ్లు తాగేవారు. ఆయనవల్ల నాతో పాటు మొత్తం మా ఉమ్మడి కుటుంబంలోని 20 మంది సమస్యలు ఎదుర్కోవాల్సివచ్చింది. సరిగ్గా ఆఫీసుకు వెళ్లేవారు కాదు. దాంతో ఉద్యోగం నుంచి తీసేస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. నేను వారిని కాళ్లా వేళ్లా పడి బతిమాలితే వదిలేశారు. అలా 1985-94 మధ్య నరకం అనుభవించాను. ఆయనను ఎలాగైనా బాగు చేసుకుందామని ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఎన్నో ఆలయాలకు వెళ్లాను. వ్రతాలు చేశాను. కొంతమంది మాటలతో మతం మార్చుకొనేందుకూ సిద్ధమయ్యాను. అవేవీ ఫలించలేదు.

జీవితం మీద విరక్తి కలిగేది...

చివరకు తిరువాన్మియూరు టీటీకే హాస్పిటల్లో ఒక డి-అడిక్షన్ చికిత్సా కేంద్రం ఉందని తెలిసి, మావారిని చేర్పించాను.. అక్కడ మద్యం బానిసలతో పాటు వారి కుటుంబీకుల్లో ఒకరు తోడు ఉండాలి. దాంతో మావారి వెంట నేనే వున్నాను. అప్పట్లో చెన్నై మొత్తం మీద అలాంటి కేంద్రం అదొక్కటే ఉండేది. ట్రీట్‌మెంట్ తరువాత ఒక నెల బావుండేవారు. తరువాత మళ్లీ పాత పద్ధతే. దాంతో నాకు జీవితం మీద విరక్తి కలిగేది. ఆ కేంద్రంలో చికిత్స పొందుతున్నవారి కుటుంబ సభ్యులకు కూడా సైకో థెరపీ, కౌన్సెలింగ్ ఇచ్చేవారు. దాంతో నాకు కూడా మద్యపాన సమస్య మీద ఎంతో అవగాహన వచ్చింది. చివరికి... సుమారు పదేళ్ల తరువాత మావారిలో మార్పు వచ్చింది. పూర్తిగా మద్యం మానేశారు. అప్పుడు నేను ఆలోచనలో పడ్డాను. ఒక వ్యక్తి చేత మద్యం మానిపించడానికి నేను ఇంత కష్టపడ్డాను. ఇదే సమస్య ఎదుర్కొంటున్న మిగిలిన మహిళల సంగతేమిటి? అందరూ ఇంతగా పోరాడాల్సిందేనా? ఒక వ్యక్తి మద్యపానంలో కూరుకుపోతే, ఆ కుటుంబం మొత్తం నష్టపోవాలా? దేవుడు నాకు చూపించిన మంచిని నలుగురికి పంచాలనుకున్నాను. అదే కేంద్రానికి వెళ్లి బాధితులకు స్వచ్ఛందంగా కౌన్సెలింగ్ ఇవ్వడం ప్రారంభించాను. అవగాహన కల్పించాను. ఆ సెంటర్లో ఒక పెద్దాయన దీనికి సంబంధించి కోర్సు చేస్తే అధికారికంగా కౌన్సెలింగ్ ఇవ్వవచ్చని సూచించారు. అప్పటికే నేను బీఏ హిస్టరీ చేశాను. అప్పటికి నా వయసు 33 ఏళ్లు.. ఎంఏలో చేరే అవకాశం ఉన్నా... కావాలనే బీఏ సైకాలజీలో చేరాను. తరువాత ఎంఏ సైకాలజీ, ఎంఫిల్ చేశాను. డి-అడిక్షన్ సెంటర్‌లో పని చేయడానికి అవసరమైన శిక్షణ పొందాను. అనేక కోర్సులు చేశాను. ఆ తరువాత టీటీకే సెంటర్ వారు ఫ్యామిలీ థెరపిస్ట్, రిహాబిలిటేషన్ కౌన్సెలర్‌గా అవకాశం ఇచ్చారు. అక్కడ ఏడేళ్ల పాటు పని చేశాను. ఆ తరువాత చెన్నై కార్పొరేషన్‌కు చెందిన 'కెపాక్స్' అనే కేంద్రంలో చేరాను. అక్కడి నుంచి 15 సంవత్సరాల పాటు వివిధ కేంద్రాల్లో పని చేశాను.

పరిమితులు లేని సేవకోసం...

డి-అడిక్షన్, మద్యపానం, మాదకద్రవ్యాల వ్యసనం తదితర అంశాలపై పని చేశాను. అక్కడ నాకు పరిమితులు ఉండేవి. వాటిని అధిగమించి సేవ చేయడానికి సొంతంగా ఒక స్వచ్ఛంద సంస్థను, దానికి అనుబంధంగా డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని దృఢంగా అనుకున్నాను. ఆ కేంద్ర భవనంలో వార్డులు, ఓపెన్ ఏరియా, థెరపీ సెంటర్, కిచెన్, థియేటర్ హాల్ లాంటివన్నీ ఉండేలా ప్రణాళిక వేసుకున్నాను. దాని గురించి మా వారికి చెబితే "ఇవన్నీ కావాలంటే కొన్ని కోట్లు కావాలి. మనకంత శక్తి ఎక్కడిది?" అన్నారు.. దాంతో మా ఆర్థిక స్తోమత మేరకు పరిమితంగానే పని ప్రారంభించాను. 2005లో 'కన్సర్న్' అనే సంస్థను ఏర్పాటు చేశాను. అనంతరం డబుల్-బెడ్‌రూమ్ ఇంటిని అద్దెకు తీసుకొని, అయిదు పడకలతో డి-అడిక్షన్ సెంటర్‌ని ప్రారంభించాం. ఇప్పుడు మాడంబాక్కంలో ఇది నడుస్తోంది. ఈ కేంద్రానికి వచ్చిన వారికి అన్నీ బోధపడేలా చెప్పి, వ్యసనం మాన్పించడానికి ప్రయత్నిస్తాం. ఇప్పుడు సామాజిక న్యాయ మంత్రిత్వశాఖతో కలిసి పని చేస్తున్నాం. మా 'కన్సర్న్'లో ఆహారం, చికిత్స, కౌన్సిలింగ్, మందులు తదితరాలన్నీ ఉచితమే. ఇప్పటి వరకూ 2 వేల మందికి చికిత్స అందించాం.

> 'మా స్వస్థలం చెన్నై. మా అత్తగారి పూర్వీకులు ఆంధ్రా సరిహద్దు నుంచి వచ్చి చెన్నైలోనే స్థిరపడ్డారు. మేం తెలుగునాయుళ్లం. ఇంట్లో తెలుగే మాట్లాడతాం. మా పిల్లలు, మనవళ్లు అందరూ ఇంట్లో తెలుగు మాట్లాడాల్సిందే. నో డాడీ.. నో మమ్మీ... 'అమ్మా-నాన్నా' అని పిలవాల్సిందే. మన అమ్మ భాషను మరచిపోతే అమ్మను కూడా మరచిపోయినట్లే. అందుకే ఒక్కొక్కరికి నాలుగైదు భాషలు వచ్చినా అందరం మాట్లాడేది తెలుగులోనే."

మమ్మల్ని సంప్రదించాలంటే...

"మా వెబ్‌సైట్ ద్వారా, 'కన్సర్న్' హెల్ప్‌లైన్: 044-46865176 ద్వారా మమ్మల్ని సంప్రదించవచ్చు. మా సంస్థ గురించి అందరికీ తెలుసు. తమిళనాట ఎవరైనా డి-అడిక్షన్ కేంద్రం పెట్టాలంటే ముందుగా మమ్మల్నే సంప్రదిస్తారు. బాధితుడికి చికిత్స పూర్తయిన తరువాత కొన్ని కుటుంబాలు వారిని తీసుకువెళ్లడానికి ఇష్టపడవు. అలాంటివారికి మేమే నెల రోజుల పాటు బస కల్పిస్తాం. ఆ నెల రోజుల్లో వారు ఏదో ఒక ఉపాధి వెతుక్కోవాల్సి ఉంటుంది."

కుటుంబ మద్దతు అవసరం


మద్యపాన బానిసలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. చాలామంది "ఏం చేసినా ఆయన మారరు" అంటూ ఉంటారు. అది తప్పు. అలా అనుకుంటే మా వారు మారేవారా? ఇంతమంది జీవితాలను మేం ప్రభావితం చేయగలిగేవారమా?. కాబట్టి నిరంతరం ప్రయత్నం చేయాల్సిందే. మద్యానికి అలవాటుపడిన వారిని అలాగే వదిలేయకండి. మానసికంగా వారికి దగ్గరవ్వండి, వారి బాగోగులు చూసుకునేందుకు మీరున్నారన్న నమ్మకం కలిగించండి. వారిని ఇలాంటి రిహాబిలిటేషన్ సెంటర్లకు తీసుకువచ్చి చికిత్స చేయించండి. చికిత్స పొందిన తరువాత కూడా ఏడాదిపాటు కుటుంబ సభ్యులు వారిని గమనిస్తూ, అదుపులో ఉంచాలి. ఏడాదిపాటు మద్యం జోలికి పోలేదంటే, ఇక జీవితంలో అటు వైపు వెళ్లరు.

ఆ సంతృప్తి మాటల్లో చెప్పలేను...

మాకు ఒకే అబ్బాయి. అతను ఆర్కిటెక్ట్. జీవితంలో స్థిరపడ్డాడు. మాకు ఎలాంటి బరువు బాధ్యతలు లేవు. అందుకే నాలాంటి బాధితుల్ని గట్టెక్కించాలన్న ఉద్దేశంతో ఈ సేవను ఎంచుకున్నాను. మా వారు రిటైరయ్యాక ఆయన కూడా నాకు పూర్తిగా సహకరిస్తున్నారు. ఆయన మద్యపానానికి వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. మా దగ్గర చికిత్స పొందిన వారి కుటుంబ సభ్యులు సంతోషంగా మా దగ్గరకు వచ్చినప్పుడు మాకు కలిగే సంతృప్తిని మాటల్లో చెప్పలేను."

● డాక్టర్ ఎస్‌కేఎండీ గౌస్‌బాషా, చెన్నై
ఫొటోలు: కర్రి శ్రీనివాస్

ముత్యాల ముగ్గు





17 చుక్కలు, 17 వరుసలు

జి. సుహాసిని, మచిలీపట్నం

ఈ-మెయిల్: features@andhrajyothy.com

పంచదారకు బదులుగా...

చలికాలంలో తరచుగా వచ్చే ప్రత్యేక సందర్భాల కోసం తీపి పదార్థాలు వండుతుంటాం. వీటిలో చాలావరకూ పంచదారనే ఉపయోగిస్తాం. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. పంచదారకు బదులు ఏమి వాడవచ్చో తెలుసుకుందాం!

తేనె



● ఇది సహజంగా లభించే తీపి పదార్థం. దీనిని సంప్రదాయ తీపి వంటకాలతోపాటు కేకులు, కుకీలు, పేస్ట్రీల తయారీలో వాడవచ్చు. తేనెలోని విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు కలిసి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ముడి తేనె వాడుకోవడం మంచిది.

బెల్లం



● దీనిని చెరకు లేదా తాటి రసంతో తయారు చేస్తారు. రెండూ ఆరోగ్యానికి మంచివే. వీటిలో ఐరన్ అధికంగా ఉంటుంది. నువ్వుల లడ్డూలు, క్యారెట్ లేదా గాజర్ హల్వా, పుడ్డింగ్‌ల తయారీలో బెల్లాన్ని వాడడం మంచిది.

ఖర్జూరాలు



● కేక్, కుకీల తయారీలో ఖర్జూరం సిరప్... ఖీర్, పాయసం, హల్వా, డ్రైఫ్రూట్ లడ్డూల తయారీలో ఖర్జూరం పేస్ట్... వాడుకోవచ్చు. ఖర్జూరంలో ఉండే పొటాషియం రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా నిరోధిస్తుంది.

ఇలపై ఇంద్రధనస్సు

ఇంద్రధనస్సులోని వర్ణాలను ఇలపైకి దించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు తెలుగు సంస్కృతిని, సంప్రదాయాల్ని ప్రతిబింబిస్తూ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలో ముగ్గులను తీర్చిదిద్దారు. గుంటూరు, తెనాలి, నరసరావుపేట కేంద్రాల్లో జరిగిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. సప్తవర్ణాలతో మహిళలు వేసిన ముగ్గులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.





తెనాలిలో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, విజేత లక్ష్మీతిరుపతమ్మకు బహుమతి అందజేస్తున్న రాజకుమారి, మురళి, నాగభూషణం తదితరులు





నరసరావుపేటలో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు



గుంటూరులో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, ఇన్‌సెట్‌లో విజేత పూజిత



గుంటూరులో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు

గుంటూరులో తృతీయ బహుమతి పొందిన ముగ్గు, విజేత చందనకు బహుమతి అందజేస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు తదితరులు





నరసరావుపేటకు చెందిన ఏ నాగజ్యోతికి ద్వితీయ బహుమతిని అందజేస్తున్న నాగసరపు సుబ్బరాయ గుప్తా, అనురాధ



నరసరావుపేటలో తృతీయ బహుమతి సాధించిన ముగ్గు







తెనాలిలో మూడవ బహుమతి పొందిన ముగ్గు, విజేత పి.సాయిచైతన్యకు బహుమతి అందజేస్తున్న రాజకుమారి, మురళి, నాగభూషణం తదితరులు



నరసరావుపేటలో తృతీయ బహుమతిని పాపన సుజాతకి అందజేస్తున్న నాగసరపు సుబ్బరాయ గుప్తా, అనురాధ

ముగ్గులు.. మురిశాయి



తెనాలి: ముగ్గులను పరిశీలిస్తున్న మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, గణేష్ యూత్ మురళి, న్యాయనిర్ణేతలు



నరసరావుపేట: ముగ్గులను పరిశీలిస్తున్న స్పాన్సరర్స్ శారదాంబ జ్యూయలర్స్ అధినేత, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బారాయగుప్తా, అనురాధ

(5వ పేజీ తరువాయి)

15 మందికి నాలుగో, 25 మందికి ఐదో, మరో 60 మందికి ప్రోత్సాహక బహుమతలను గణేష్ యూత్ సభ్యులు కనగాల నాగభూషణం, బొద్దులూరి వేణు, గొల్లపూడి సాయిగిరి, ఎల్ఎంఎల్ ఖాదర్, కె.విష్ణు, గుమ్మడి రవీంద్రలు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వీరవల్లి మురళి మాట్లాడుతూ సంక్రాంతి సంస్కృతిని భావితరాలకు అందించేందుకు ముగ్గుల పోటీలు దోహదపడతాయన్నారు. ముగ్గులు వేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మనసుకు ఆహ్లాదం కూడా కలుగుతుందన్నారు. చిన్నారులు, యువతులు కూడా ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొనడం మంచి పరిణామమన్నారు. మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ, సంక్రాంతి సంబరం ముందుగానే వచ్చిన అనుభూతి కలిగిందని, ఓర్పుతో మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులు ముచ్చట గొలిపాయన్నారు. ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి సూర్యదేవర సాంబశివరావు పోటీలను పర్యవేక్షించారు.



గుంటూరు: ముగ్గులను పరిశీలిస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి గింజుపల్లి భాస్కరరావు తదితరులు

ఆంధ్రజ్యోతి ప్రయత్నం అభినందనీయం : సుబ్బరాయగుప్తా

నరసరావుపేలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరిగిన ముగ్గుల పోటీలతో ఆ ప్రాంగణంలో సంక్రాంతి సందడి నెలకొంది. బహుతుల ప్రధానోత్సవ సభలో మాజీ మున్సిపల్ చైర్మన్, శారదాంబ జ్యూయలర్స్ అధినేత నాగసరపు సుబ్బరాయగుప్తా మాటాడుతూ అపార్టుమెంట్ల సంస్కృతి రావడంతో ఇళ్ల ముందు ముగ్గులేసే సంప్రదాయం నానాటికీ కనుమరుగవుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో ఆంధ్రజ్యోతి పత్రిక సామాజిక బాధ్యతతో 15 ఏళ్లుగా ముగ్గుల పోటీ నిర్వహిస్తు, మన సంస్కృతిని కాపాడుతుండటం అభినందనీయమన్నారు. అనురాధాగుప్తా మాట్లాడుతూ ఇంటికి దీపం ఇల్లాలు ఎలాగో ఇంటి ముందు ముగ్గు ఇంటికి అందం అన్నారు.



గుంటూరులో ముగ్గుల పోటీలో పాల్గొన్న వారికి భోజనాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



గుంటూరులో ముగ్గుల పోటీలు సందర్భంగా చిన్నారుల నృత్యం



తెనాలిలో మగ్గుల పోటీలకు వచ్చిన మహిళలు



తెనాలిలో నాలుగో బహుమతి అందజేస్తున్న నన్నపనేని రాజకుమారి

సంక్రాంతికి గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సెలవుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా పలు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ ఆదివారం తెలిపారు. నంబరు. 07037 వికారబాద్ - కాకినాడ టౌన్ రైలు ఈ నెల 13వ తేదీన రాత్రి 7.40కి బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా 14వ తేదీ ఉదయం 8.30కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07038 కాకినాడటౌన్ - చర్లపల్లి రైలు ఈ నెల 14వ తేదీన రాత్రి 8.30కి బయలుదేరి గుంటూరు మీదుగా 15వ తేదీ ఉదయం 8.30కి చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 07035 చర్లపల్లి - నరసపూర్ రైలు ఈ నెల 11, 18 తేదీల్లో రాత్రి 7.15కి బయలుదేరి గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 5.50కి నరసపూర్ చేరుకొంటుంది. నంబరు. 07036 చర్లపల్లి - నరసపూర్ రైలు ఈ నెల 11, 18 తేదీల్లో రాత్రి 7.15కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 07078 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ రైలు ఈ నెల 12, 19 తేదీల్లో ఉదయం 10.05 గంటలకు బయలుదేరి గుంటూరు మీదుగా అదే రోజు రాత్రి 7.30 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07079 కాకినాడ టౌన్ - సికింద్రాబాద్ రైలు ఈ నెల 12, 19 తేదీల్లో రాత్రి 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. నంబరు. 07033 చర్లపల్లి - నరసపూర్ రైలు ఈ నెల 7, 9, 13, 15, 17 తేదీల్లో రాత్రి 7.30కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 5.50కి నరసపూర్ చేరుకొంటుంది. నంబరు. 07034 నరసపూర్ - చర్లపల్లి రైలు ఈ నెల 8, 10, 14, 16, 18 తేదీల్లో రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 07031 చర్లపల్లి - కాకినాడ టౌన్ రైలు ఈ నెల 8, 10, 12, 14 తేదీల్లో రాత్రి 9.45కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 8.30కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07032 కాకినాడ టౌన్ - చర్లపల్లి రైలు ఈ నెల 9, 11, 13, 15 తేదీల్లో రాత్రి 8.30కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.35కి చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 07025 చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు రైలు ఈ నెల 9, 12, 14 తేదీల్లో రాత్రి 7.20కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకొంటుంది. నంబరు. 07026 శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి రైలు ఈ నెల 10, 13, 15 తేదీల్లో మధ్యాహ్నం 2.45కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 07041 కాచీగూడ - శ్రీకాకుళం రోడ్డు ఈ నెల 7వ తేదీన రాత్రి 7.45కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 8 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు, నంబరు. 07042 శ్రీకాకుళం రోడ్డు - కాచీగూడ రైలు ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం 2.45కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 7.30కి చర్లపల్లి చేరుకొంటుందని సీపీఆర్‌వో తెలిపారు. నేడు, రేపు రెండు ప్రత్యేక రైళ్లు: సోమ, మంగళవారాల్లో గుంటూరు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. నంబరు. 07077 చర్లపల్లి - తిరుపతి రైలు ఈ నెల 6వ తేదీన(సోమవారం) మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి మీదుగా రాత్రి 7.45కి గుంటూరు, ఆ తర్వాత తెనాలి, బాపట్ల, చీరాల మీదుగా ప్రయాణించి మంగళవారం వేకువజామున 4 గంటలకు తిరుపతి చేరుకొంటుంది. నంబరు. 07078 తిరుపతి - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 7వ తేదీ మంగళవారం రాత్రి 8 గంటలకు తిరుపతిలో బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2.30కి గుంటూరుకి వచ్చి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదుగా బుధవారం చర్లపల్లి చేరుకొంటుంది.





మోగిన శంఖం

కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతీ, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు





సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజి మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద



హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం

మాజీ సైనికుల కార్పొరేషన్ ఏర్పాటు హామీపై హర్షం

మంగళగిరి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏపీలో మాజీ సైనికుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించడంపై మాజీ సైనికుల సంక్షేమ సంఘం హర్షం వెలిబుచ్చింది. మంగళగిరి ఏపీఎస్పీ ఆరో పటాలంలో మాజీ సైనిక సంఘాల రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. మాజీ సైనిక సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గోవిందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మాజీ సైనిక సంఘాలు అనేకం ఉన్నాయని, వీటన్నింటినీ ఒకతాటిపైకి తీసుకువచ్చి ఒక రాష్ట్రం, ఒకే మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఉండాలనే ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మరో మూడు నెలల్లో సంఘాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మాజీ సైనికుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ తీర్మానించారు. సమావేశంలో మంగళగిరి వెటరన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, శ్రీకాకుళం అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు, నేతలు సూరిరెడ్డి శివకుమార్, పి.విశ్వేశ్వరరావు, ఎస్ఎస్ రాముడు, ఎన్.నాగేశ్వరరావు, ఏపీ నాయుడు, అన్నె రామారావు, జి.కోటేశ్వరరావు, అడపా శంకర్, సీహెచ్ వెంకట అప్పారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాజీ సైనిక సంఘాల ప్రతినిధులు

అమ్మవారి దర్శనం ఎంతో పుణ్యఫలం

- ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్

పిట్టలవానిపాలెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీబగళాముఖి అమ్మవారిని దర్శించుకోవటం ఎంతో పుణ్య ఫలమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ అన్నారు. మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత బాపట్ల మున్సిఫ్‌కోర్టు మెజిస్ట్రేట్, ఆర్డీవో, రెవెన్యూ, చందోలు పోలీసులు, చందోలు గ్రామ పంచాయతీ సిబ్బంది వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం దేవస్థానం సంప్రదాయం ప్రకారం ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సిబ్బందితో కలిసి పూర్ణకుంభంతో ఆలయ ప్రదక్షణ గావించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన జస్టిస్ చల్లా గుణరంజన్ దంపతులకు దుశ్శాలువాతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికను, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకులు కొండవీటి శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజాన్ దంపతులను సన్మానిస్తున్న ఆలయ ఈవో నరసింహమూర్తి

రేపటి నుంచి ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ

గుంటూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరల కోసం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీ ఈఆర్‌సీ) ఆధ్వర్యంలో విజయవాడ, కర్నూలు నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7, 8వ తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వ్యక్తిగతంగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. అలానే ఈనెల 10వ తేదీన కర్నూలులో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వ్యక్తిగతంగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయసేకరణ నిర్వహిస్తారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి హాజరయ్యే వారు ముందుగానే తమ పేర్లను ఆన్‌లైన్‌లో ఏపీఈఆర్‌సీలో గానీ, గుంటూరు సంగడిగుంటలోని సర్కిల్ కార్యాలయంలో గానీ, గుంటూరు నల్లచెరువు, తెనాలి (చెంచుపేట) డివిజనల్ కార్యాలయంలోనైనా ముందుగానే నమోదు చేసుకొనే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ మూడు రోజుల్లో గుంటూరు సర్కిల్ కార్యాలయం, తెనాలి, గుంటూరు నల్లచెరువులోని డివిజనల్ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం జరుగుతుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	113,121,132
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

స్వయం ఉపాధికి మూడు నెలల ఉచిత శిక్షణ

బాపట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సీడాప్ ఆధ్వర్యంలో పారిశ్రామిక రంగంలో ఉపాధి, స్వయం ఉపాధి, ఇతర రంగాలలో మూడునెలల నాణ్యమైన రెసిడెన్షియల్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుడు షేక్ రోషన్ జమీర్‌బాషా తెలిపారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బుద్ధులు, పార్సీలు, జైనులకు చెందిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన యువత 10వ తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్ లేదా ఏదైన డిగ్రీ చదివిన వారు అర్హులని, ఉచిత శిక్షణలో రవాణ, కెరీర్ కౌన్సెలింగ్, యూనిఫారం, వసతి, ఆహారం, స్టడీ మెటీరియల్, ఎన్ఎస్‌డీసీ సర్టిఫికేషన్, ఉద్యోగ శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. వివరాలకు 9704310808, 0866-2571155 నెంబరులో సంప్రదించాలన్నారు.

నేడు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం

పిట్టలవానిపాలెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 6న మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ సమావేశపు హాలులో ఇన్‌చార్జి ఎంపీపీ సీతారామరాజు అధ్యక్షతన జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఐ.సత్యనారాయణరావు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొంటారని చెప్పారు. అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, 14 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కార్యదర్శులు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

ఆర్థిక అవినీతి, అరాచకాలకు జగన్ జైలుకెళ్ళటం ఖాయం : కొల్లా

బాపట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి గగ్గోలు పెట్టి గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించటం సిగ్గుచేటు అని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ ప్రభుత్వం చేసిన ఆర్థిక అరాచకాలు బట్టబయలై కొత్త అప్పులు సైతం పుట్టని దారుణ పరిస్థితి ఏర్పడిందన్నారు. జగన్ జమానాలో ఒక్క అభివృద్ధి కార్యక్రమమైన జరగకుండానే 10 లక్షల కోట్లు అప్పులు తెచ్చి అప్పనంగా దిగమింగిన దుచ్చరిత్ర రాజ్యమేలిందన్నారు. ఈ ఆసమర్థ, అవినీతి, ఆరాచకాలకు జగన్ జవాబు చెప్పాలన్నారు. జగన్ హయాంలో జరిగిన ఆర్థిక అరాచకాలకు అతనితోపాటు బాధ్యులంతా జైలుకెళ్ళటం ఖాయమని అన్నారు.

ఏప్రిల్ 13న పూర్వ విద్యార్థుల సమావేశం

బాపట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం 76 సంవత్సరాల వార్షికోత్సవం ఏప్రిల్ 13వ తేదీ నిర్వహించాలని తీర్మానం చేశారు. హైస్కూల్ ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థుల సంఘ సమావేశం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు విన్నకోట సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఈ నెల 12వ తేదీన జరగాల్సిన సమావేశాన్ని ఏప్రిల్ నెలలో నిర్వహించే విధంగా చర్చించారు. దీనికి సభ్యులంతా ఆమోదం తెలిపారు. తదుపరి సమావేశం ఈనెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో కార్యదర్శి కొలగాని వెంకట సత్యనారాయణ, సభ్యులు గోపాళం దుర్గాప్రసాద్, డాక్టర్ పీవీ కృష్ణారావు, సీతారాంకుమార్, కొటికలపూడి సోమయ్య, భీమా శంకరరావు, ఖాజాఖాన్, కోళ్ళపూడి సురేష్, బి.బందాబాబు, తోట రామాంజనేయులు, కత్తి శ్రీనివాసరావు, బి.సాంబశివరావు, ఆర్.సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకే పింఛన్లు అందాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన లబ్ధిదారులకే పింఛన్‌లు అందాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన సంబంధితాధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పింఛన్‌లు అందుకుంటున్న లబ్ధిదారుల వివరాలు పునఃపరిశీలన చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వివిధ రకాలైన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు మొత్తంను అనర్హులు కూడా పొందుతున్నారని, సదరు పింఛన్‌దారుల అర్హతలను తిరిగి పరిశీలించాలని, క్షేత్ర స్థాయి నుంచి ఫిర్యాదులు అందిన దృష్ట్యా ప్రభుత్వం ముందస్తుగా దివ్యాంగుల పింఛన్‌దారులకు సంబంధించిన అంగవైకల్యంను పరిశీలించటం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా వివిధ విభాగాలకు చెందిన వైద్యులుగా టీమ్‌లుగా ఏర్పాటు చేసి పక్షవాతం, యాక్సిడెంట్ తదితర కారణాలతో మంచానికే పరిమితమైన వారి ఇళ్ళ వద్దకు వెళ్ళి పరిశీలన చేసేందుకు నియమనిబంధనలను విడుదల చేయటం జరిగిందన్నారు. సోమవారం నుంచి పరిశీలన నిర్వహణ మొదలు పెట్టవల్సిందిగా తెలియజేశారు. జిల్లాకు కేటాయించిన మూడు వైద్య బృందాలతో షెడ్యూల్‌లో తెలిపిన విధంగా 25 మండలాలలో ఉన్న 643 మంది నడవలేని స్థితిలో మంచానికే పరిమితమై ఉండి రూ.15 వేల చొప్పున పింఛన్ తీసుకునే లబ్ధిదారుల అంగవైకల్యాన్ని పునఃపరిశీలించాలన్నారు. 6వ తేదీ నుంచి 28వ తేదీ వరకు పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. జాబితాలో ఉన్న అందరు ఫించన్‌దారులు అధికారులకు సహకరించి సదరు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కలెక్టర్ తెలియజేశారు.

హైందవ శంఖారావానికి తరలివెళ్ళిన భక్తులు



హైందవ శంఖారావం కార్యక్రమానికి తరలివెళుతున్న బాపట్ల భక్తులు

బాపట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గన్నవరం మండలం కేసరపల్లి వద్ద జరిగిన రాష్ట్ర స్థాయి హైందవ శంఖారావం సభకు బాపట్ల నియోజకవర్గం నుంచి ప్రజలు, బీజేపీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్ళారు. విశ్వహిందూ పరిషత్ సభ్యురాలు బంద్రెడ్డి రజనీ, బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు నాళం నరేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మామిడి రమేష్, బాలనారాయణ, ప్రసాద్, బాలాజి, రాము, సూర్య, బుర్లె రత్తయ్య, శ్రీనివాస్, సుధీర్ తదితరులు తరలి వెళ్ళినవారిలో ఉన్నారు.

● కర్లపాలెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లాలోని గన్నవరం సమీపంలో ఉన్న కేసరిపల్లి వద్ద ఆదివారం జరిగే హైందవ శంఖారావం కార్యక్రమానికి మండలంలోని 20 పంచాయతీల నుంచి 100 బస్సులు, 200 కార్లు, పలు వాహనాలలో వేలాది మంది హిందూ కుటుంబాలు తరలివెళ్ళారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు ముందుగా అన్ని గ్రామాలకు బస్సులు, తదితర వాహనాలను ఏర్పాటు చేయగా హిందువులంతా వాహనాలలో హైందవ శంఖారావ సభకు వెళ్ళారు.

● చెరుకుపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా గన్నవరంలో జరగనున్న హైందవ శంఖారావం సభకు చెరుకుపల్లి నుంచి 12 బస్సులలో 500 మంది బయలుదేరివెళ్ళారు. రాంపల్లి జగన్నాథశాస్త్రి, ఉప్పు సాంబశివరావు, విస్సంశెట్టి శ్రీనివాసరావు, జీ.శ్రీనివాస్, సుధారాణి, పొన్నపల్లి సత్యనారాయణ, సీహెచ్ మురళి, ఎస్.భాను ఆధ్వర్యంలో కార్యకర్తలు బయలుదేరి వెళ్ళారు.

బలహీనవర్గాల ప్రజలకు చట్టం గురించి తెలియజేయాలి : సలగల



రాజశేఖర్‌బాబును సత్కరిస్తున్న చంద్రమోహన్, అచ్యుతరాజు

బాపట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీనవర్గాల ప్రజలకు సమాచార హక్కు చట్టం గురించి తెలియజేయాలని బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖరబాబు తెలియజేశారు. ఫోరం ఫర్ ఆర్టీఐ జాతీయ అధ్యక్షుడు ప్రత్తిపాటి చంద్రమోహన్, జిల్లా అధ్యక్షుడు మద్దిబోయన అచ్యుతరాజులు ఆదివారం బావుడా ఛైర్మన్‌ను కలిసి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించటం అభినందనీయమన్నారు.

ఘనంగా భీమ్‌కోరేగావ్ శౌర్య దినోత్సవం

పిట్టలవానిపాలెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం ఐలెండ్ సెంటర్ కూడలిలో భీమ్‌కోరేగావ్ శౌర్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బాపట్ల జిల్లా ఏఐఏజీ అధ్యక్షుడు చింతా సురేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏఐఎం వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ సునీల్‌కుమార్ (ఐపీఎస్) ఆదేశాలు, ఏఐఎం జోనల్ ఇన్‌చార్జి మదిరి శేషయ్య సూచనల మేరకు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎం సభ్యులు నిరంజన్‌బాబు, శ్యామ్ సుందర్, భూషణం, ఎద్దు శామ్యూల్ రాజు, రేమో ఏసుబాబు, విన్నిబాబు, పున్నారావు, రాజీవ్‌బాబు, శ్యామ్‌సుందర్, శశిబాబు, పవన్‌రాజు, రమేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

జనార్దనస్వామికి ధనుర్మాస ఉత్సవాలు

కర్లపాలెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీలోని అగ్రహారంలో ఉన్న శ్రీ జనార్దనస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా 21వ రోజు అమ్మవారి 21వ పాశురం పారాయణం చేశారు. తిరుప్పావై, హనుమాన్ చాలీసా పారాయణం, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. బృందావనం శ్రీనివాసచార్యులు, వేదాంతం శ్రీనివాసచార్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించగా పెనుమెత్స పార్వతి పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

● ఎమ్మెల్యే ఆనందబాబు



బేతేలుపురం చర్చిలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : లోకహితం కోసం జన్మించిన యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండలంలోని బేతేలుపురంలో తెలుగు బాప్టిస్టు చర్చి వార్షికోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పాస్టర్ సంద్రపాటి లాజరస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, మతానుసారంగా సంస్కృతి, సంప్రదాయాలను ఏ ఒక్కరూ విడనాడవద్దన్నారు. పాస్టర్ లాజరస్ ప్రత్యేక ప్రార్థన ద్వారా ఆనందబాబును ఆశీర్వదించారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త రాజేష్, సంఘ పెద్దలు, సంఘస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గ్రామీణ వైద్యుడు వెంకటేశ్వరరావుకు సత్కారం



గ్రామీణ వైద్యుడు తులం వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

వేమూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామానికి చెందిన వైద్యుడు తులం వెంకటేశ్వరరావును మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా సత్కరించారు. పట్టణం, డివిజన్ స్థాయి ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సభలో ఆలపాటి మాట్లాడుతూ వెంకటేశ్వరరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నారాయణ వేణుగోపాల్, పలువురు అసోసియేషన్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పూజ

● 27 పవిత్ర ద్రవ్యాలతో అభిషేకాలు ● శరణుఘోషతో మార్మోగిన వేమూరు



పూజలు నిర్వహిస్తున్న శ్రీనివాస గురుస్వామి

వేమూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీ అయ్యప్ప స్వామి సమాజం ఆధ్వర్యంలో వేమూరులోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయ ప్రాంగణంలో ఆదివారం అయ్యప్పస్వామి వార్షిక గ్రామ పూజా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మన్నె శ్రీనివాస గురుస్వామి పంచ మండపాల పూజ నిర్వహించారు. అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహానికి 27 పవిత్ర ద్రవ్యాలతో విశేష అభిషేకం జరిపారు. భాస్కర్ ఆర్కెస్ట్రా బృందం ఆలపించిన అయ్యప్ప స్వామి భక్తి గీతాలు భక్తులను అలరించాయి. అనేక గ్రామాల నుంచి అయ్యప్ప దీక్షాపరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజ అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గ్రామ ఉత్సవం జరిపారు.

పశువుల పాక, గడ్డి వామి దగ్ధం

కొల్లూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పశువుల పాక, గడ్డి వామి దగ్ధమైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని మొసలిపాడులో కట్టుపల్లి సుజాతకు చెందిన గడ్డి వామి, పశువుల పాకకు నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి. పశువుల పాకలో ఉన్న నాలుగు పశువులు అగ్నికి తీవ్రంగా గాయపడ్డాయి. ప్రమాదంలో రూ.50 వేలు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితురాలు తెలిపారు.



మెడికల్ క్యాంప్‌లో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న శివప్రసాద్

ఆరోగ్యంపై నిరంతరం శ్రద్ధవహించాలి

● అనగాని శివప్రసాద్

రేపల్లె, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యంపై నిరంతరం శ్రద్ధ వహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అనగాని శివప్రసాద్ అన్నారు. విజయవాడ జీబీఆర్ ఫౌండేషన్, ఇండియన్ మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణమండపంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తీరప్రాంతంలోని ప్రజలకు సేవలు అందించటంలో ఇండియన్ మెడికల్ కల్చరల్ అసోసియేషన్ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, మెడికల్ అండ్ కల్చరల్ అసోసియషన్ కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గొట్టుముక్కల బాపారావు, సంజీవని వైద్యులు డాక్టర్ గోపాల్, శివన్నారాయణ, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

కృషిబాబు సేవలు స్ఫూర్తిదాయకం

● చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

బాపట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యావేత్తగా, హైకోర్టు న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా కామేపల్లి కృషిబాబు ప్రజలకు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామంలో ఆదివారం కృషిబాబు సంస్మరణ సభ నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరి, మాజీ ఎంపీపీ మానం విజేత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా పెద్దఎత్తున ప్రముఖులు హాజరై ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సభలో ప్రసంగించారు. కృషిబాబు స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సేవలు విస్తరింప చేసి ప్రజా సంక్షేమానికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, డాక్టర్ కామేపల్లి రత్నబాబు, డాక్టర్ గోరంట్ల సుబ్బారావు, కామేపల్లి భూపాల్, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, కంచర్ల విజయభాస్కర్, కోట వెంకటేశ్వరరెడ్డి, జెట్టి దినేష్, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి, అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.చార్వాక, కాలింత దిలీప్, సాల్మన్‌రాజు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్‌నారాయణ, న్యాయవాది శ్రీనివాసరావు, ముమ్మనేని వెంకటసుబ్బయ్య, మానం వెంకటేశ్వర్లు, బీజేపీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, కొమ్మినేని తులసీరాం, కన్నెగంటి సంధ్యారాణి, మానం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



కామేపల్లి కృషిబాబు పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

టాటా ఏస్, ద్విచక్ర వాహనం ఢీ : వ్యక్తికి గాయాలు

కర్లపాలెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కర్లపాలెం సెంటర్‌లో బాపట్ల నుంచి చందోలు వైపు వెళుతున్న టాటా ఏస్ వాహనానికి ఎదురు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనటంతో వాహనం పైనున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు.

21 సంవత్సరాలుగా 275 క్యాంప్‌లు : తిమ్మరాజు

కర్లపాలెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం శ్రీ రామకృష్ణ సేవా సమితిలో గత 21 సంవత్సరాలుగా పేరలి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 275 వైద్య శిబిరాలు నిర్వహించి వేలాది మంది రోగులకు వైద్యసేవలందించామని సమితి అధ్యక్షుడు తిమ్మరాజు వెంకటసుబ్బారావు అన్నారు. శ్రీరామకృష్ణ సేవాసమితిలో ఆదివారం షుగర్ వ్యాధిగ్రస్తులకు డాక్టర్ చల్లా రామ్మోహనరావు ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడ మందులను అందజేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాటూరి బాజి, చందు పిచ్చయ్య, మామిడాల సాంబశివరావు, సనకా శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వర్లు, జిడుగు వెంకటేశ్వరరావు, బాలకోటేశ్వరరావు, తూనుగుంట్ల లలితబాబు, తవ్వా స్వామి, లక్ష్మి, సత్యవతి, మణి, పార్వతి, ప్రసన్న, లలితమ్మ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

బాపట్లరూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై బాపట్ల రూరల్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. బాపట్ల రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు వారి సిబ్బందితో కలిసి బాపట్ల మండలం పాండురంగాపురం గ్రామశివారులో పొలాల వద్ద పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.5 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ బాపట్ల మండలంలో పేకాట, కోడిపందాలు నిర్వహించిన సహించేదిలేదని తెలిపారు.

టిడ్కో గృహాలను తక్షణమే పూర్తి చేయాలి

రేపల్లె, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో గృహాలను తక్షణమే పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కూటమిప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, కార్యదర్శి సి.శివశంకర్, టి.సత్యనారాయణ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు తొలగించుకోవాలి

రేపల్లె, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : ఖాళీ స్థల యజమానులు తక్షణమే ఆయా స్థలాల్లో పిచ్చిమొక్కలను తొలగించుకోవాలని లేని యెడల మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకుంటారని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు అన్నారు. పట్టణంలోని గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో విపరీతంగా పిచ్చిమొక్కలు ఉన్న వాటి వద్ద మున్సిపల్ అధికారులు ఆదివారం బోర్డులను ఏర్పాటు చేశారు. తక్షణమే స్థల యజమానులు పిచ్చిమొక్కలు తొలగించి చుట్టు ప్రక్కల గృహాల వారికి ఇబ్బంది కలగకుండా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సురేంద్రకుమార్, జీ.వందన, ప్రియదర్శిని, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం వైపు మార్టూరు పంచాయతీ

» విలేజ్ గ్రోత్ సెంటర్ల పథకం కింద అభివృద్ధి
» జిల్లా అధికారులకు మూడు ప్రతిపాదనలు

మార్టూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు గ్రామ పంచాయతీకి అదనపు ఆదాయం పెరిగేలా పంచాయతీ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి జిల్లా పంచాయతీ అధికారులకు పంపినట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రస్తుతం ఉన్న ఆదాయం కన్నా అదనపు ఆదాయం పెరగడానికి విలేజ్ గ్రోత్ సెంటర్లు అనే పథకానికి రూపకల్పన చేసింది. అందుకు సంబంధించిన వివరాలను రాష్ట్రం నుంచి మండలాల్లోని గ్రామ పంచాయతీలకు వచ్చినట్లు తెలిసింది. గ్రామ పంచాయతీలలో విలువైన పంచాయతీ స్థలాల్లో ఏదైనా భవనా నిర్మాణాలు,షాపులు, కల్యాణ మండపాలు, ఇతర వసతులు ఏవైనా నిర్మించి వాటిని ప్రైవేటు వ్యక్తులకు అద్దెలకు ఇవ్వడం ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకునేలా పథకాన్ని రూపొందించారు. అన్ని గ్రామ పంచాయతీలలో ఇలాంటి అవకాశాలు లేక పోయినా మేజరు గ్రామ పంచాయతీ మార్టూరు పంచాయతీ నుంచి మూడు ప్రతిపాదనలను తయారు చేసినట్లు తెలిసింది. గ్రానైట్ పరిశ్రమల పరంగా అభివృద్ధి చెందిన మార్టూరు గ్రామం మీదుగా చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి వెళ్లడం, ఇతరత్రా కారణాలు వల్ల గ్రామంలోని ఖాళీ స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో మండల కాంపెక్స్ వద్ద, ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో ఉన్న పంచాయతీకి చెందిన సుమారు 20 సెంట్ల స్థలంలో పెట్రోలు బంకు నిర్మాణం చేపట్టి, దానిని ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇస్తే పంచాయతీకి ఆదాయం పెరుగుతుందని, అందుకు రూ.కోటి మంజూరు చేయాలని మార్టూరు పంచాయతీ అధికారులు జిల్లా పంచాయతీ అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. అలాగే బలరాం కాలనీ సమీపంలో రెండో ప్రతిపాదనగా చెరువు సమీపంలోని 4 సెంట్ల పంచాయతీ స్థలంలో షాపుల నిర్మాణం కోసం కూడా రూ.25 లక్షలు నిధులు మంజూరు చేయాలని, ఈ స్థలం సమీపంలో దాదాపు 40 సెంట్లకు పైగా ఉన్న పంచాయతీ స్థలంలో కల్యాణ మండపం నిర్మించడం కోసం రూ.కోటి నిధులు మంజూరు చేయాల్సిందిగా మూడో ప్రతిపాదన తయారు చేసినట్లు తెలిసింది. ఈ మూడు ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ లభిస్తే మార్టూరు పంచాయతీకి అదనపు ఆదాయంతోపాటు పట్టణం అభివృద్ధి చెందుతుంది. దాదాపుగా మండలంలోని మార్టూరు పంచాయతీ నుంచి మాత్రమే ఈ ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలిసింది.



మార్టూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

జిల్లా పంచాయతీ అధికారికి ప్రతిపాదనలు పంపాం



మార్టూరు పంచాయతీ నుంచి మూడు ప్రతిపాదనలు తయారు చేశాం. వాటికి నిధులు మంజూరైతే పంచాయతీ స్థలాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపడతాం. తద్వారా గ్రామ పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరుతుంది. ఈ మూడు ప్రతిపాదనలను జిల్లా పంచాయతీ అధికారికి పంపించాం.

- శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో, మార్టూరు


అలవలపాడు రోడ్డుపై పారుతున్న మురుగు

రోడ్లపై మురుగు

» గ్రామాల్లో లేని కాలువలు
» ఇబ్బంది పడుతున్న ప్రజలు

పంగులూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. మురుగు కాలువల లేకే ఈ పరిస్థితి ఏర్పడిందని, దీంతో ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలవలపాడు, ముప్పవరం గ్రామాలలో ఆర్అండ్‌బీ నిర్మించిన ప్రధాన సీసీ రోడ్లపై మురుగు నీరు నిలిచి ఉంటోంది. అలవలపాడు గ్రామంలో ప్రధాన కూడలి నుంచి తక్కెళ్లపాడు వైపు వెళ్లే సీసీ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ లేని కారణంగా పలు చోట్ల నివాసాల నుంచి వచ్చే మురుగు నీరు పలు చోట్ల రోడ్డెక్కుతుంది. ముప్పవరం ప్రధాన రహదారిలో పశు వైద్యశాల సమీపంలో మురుగు నీరు ముందుకు పోక రోడ్డుపైకి ఎగబాకుతున్న పరిస్థితి. ప్రధాన రహదారులలో సీసీ రోడ్డు నిర్మాణ సమయంలో ఆర్ అండ్ బీ అధికారులు డ్రైనేజీ నిర్మాణంపై దృష్టి సారించకపోవడంతో పలు చోట్ల ఈ పరిస్థితి ఏర్పడింది. నిత్యం వాహన రద్దీ ఉండే ప్రధాన రహదారులలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళ మృతదేహం గుర్తింపు

అద్దంకి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మయపాలెంలకు చెందిన కొల్లూరి హనుమాయమ్మ (42) మృతదేహాన్ని గుండ్లకమ్మ నదిలో గుర్తించారు. హనుమాయమ్మ గత శనివారం రాత్రి బ్రిడ్జిపై నుంచి గుండ్లకమ్మ నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. వారంరోజుల పాటు మృతదేహం కోసం పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది గాలించారు. ఎట్టకేలకు శనివారం రాత్రి మోదేపల్లి సమీపంలో మృతదేహాన్ని గుర్తించారు. ఆదివారం హనుమాయమ్మ మృతదేహానికి తిమ్మయపాలెం అంత్యక్రియలు నిర్వహించారు.

గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తున్న లారీల పట్టివేత


మార్టూరు స్టేషన్‌కు తరలించిన గ్రానైట్ శ్లాబుల లారీలు

మార్టూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి బిల్లులు లేకుండా మార్టూరు నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న రెండు గ్రానైట్ శ్లాబుల లారీలను శనివారం రాత్రి మార్టూరులో విజిలెన్సు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాటిని స్టేషన్‌కు తరలించారు. వాటిపై కేసు నమోదు చేశారు.

గడ్డివామి దగ్ధం

మేదరమెట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావినూతల గ్రామంలో ఆదివారం మూడు ట్రక్కుల గడ్డివామి దగ్ధమైంది. పులిపర్తి చిన్నాకు చెందిన మూడు ట్రక్కుల వరిగడ్డికి ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీంతో అద్దంకి నుంచి వచ్చిన అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఇంచుమించు రూ.60వేల నష్టం జరిగినట్లు బాధిత రైతు వాపోయారు. పాడిపశువులు, వ్యవసాయం కోసం గడ్డి నిల్వ చేయగా దగ్ధమైందన్నారు. ప్రభుత్వం నుంచి సాయం అందించాలని కోరుతున్నారు.

గేట్ సెంటర్.. పద్మవ్యూహం

» నిత్యం ట్రాఫిక్ సమస్య
» నరకం చూస్తున్న ప్రయాణికులు


కారంచేడు గేటు సెంటర్‌లో ఉన్న ట్రాఫిక్

చీరాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గేటు సెంటర్ ప్రతి రోజూ ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. ప్రధానంగా రైళ్ల రాకపోకల సమయంలో గేటు వేసి ఉన్న సందర్భాల్లో ఆ పరిస్థితి మరింత జటిలంగా ఉంటోంది. ఆదివారం రోజులలో కూడలికి ఇరు వైపులా ఉన్న మాంసం దుకాణాలు, చేపల విక్రయాలతో కొనుగోలుదారుల రద్దీ మరీ ఎక్కువగా ఉంటోంది. ఆయా సమయాల్లో రైళ్ల రాకపోకలకు సంబంధించి గేటు వేసిన సమయాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతుండడంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. దీంతో చిన్న, చిన్న ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. వాటిలో కొన్ని వాదనలకు పరిమితం అవుతుండగా, మరికొన్ని బల నిరూపణకు దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీస్‌ను ఏర్పాటు చేయడం ఎంతైనా అవసరమని ప్రజలు భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా ఆ ప్రాంత పరిధిలోని పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


వాహనాలతో రద్దీగా ఉన్న కారంచేడు గేటు సెంటర్


పంగులూరు ఉన్నత పాఠశాలలో విద్యోన్నతి ఫౌండేషన్ నిర్వహించిన పోటీ పరీక్షకు హాజరైన విద్యార్థులు

విద్యోన్నతి ఫౌండేషన్ పోటీ పరీక్షకు స్పందన

103 మంది విద్యార్థులు హాజరు

పంగులూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యోన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పోటీ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు 103 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీ పరీక్షకు పంగులూరు మండల పరిధిలో ఆరు ఉన్నత పాఠశాలలకు చెందిన 110 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ పరీక్షలో ప్రతిభ చాటిన ఐదుగురు విద్యార్థులకు విద్యోన్నతి ఫౌండేషన్ వారు ఇంటర్ లేదా తత్సమాన కోర్సు చదివేందుకు ఒక్కొక్కరికీ రెండు సంవత్సరాల పాటు ఏడాదికి రూ.10వేల వంతున ఆర్థిక సాయాన్ని అందించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఏకకాలంలో అద్దంకి, పంగులూరు, ఇంకొల్లు మండల కేంద్రాలలో ఆయా మండలాల పరిధిలోని విద్యా ర్థులకు ఈ పరీక్ష నిర్వహించినట్లు ఫౌండేషన్ డైరక్టర్ జయశంకర్ తెలిపారు. స్థానిక ఉపాధ్యాయుల సహకారంతో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వీరాంజనేయులు, జయశంకర్ పర్యవేక్షణలో పంగులూరు కేంద్రంలో ఈ పరీక్షను నిర్వహించారు.

ఇంకొల్లులో 68మంది హాజరు

ఇంకొల్లు : మండలంలోని 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యోన్నతి పౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు 73 మంది పేర్లు నమోదు చేసుకోగా, 68 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని పర్యవేక్షకులు కరి కమలేశ్వరరావు తెలిపారు. పరీక్షలో మెరిట్ పొందిన విద్యార్థులు ఇంటర్ చదువుకు ఆర్థిక సాయం అందజేస్తామని ఫౌండేషన్ డైరెక్టర్ ధూళిపాళ్ల వీరనారాయణ తెలిపారు. ఇన్విజిలేటర్లుగా గోరంట్ల హరిబాబు, జాగర్లమూడి ప్రభాకరరావు వ్యవహరించారు.

నిలువెత్తు నిర్లక్ష్యం

ఎంపీడీవో కార్యాలయం భవనానికి ముప్పు

అద్దంకి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి ఎంపీడీవో కార్యాలయం భవనం నిర్వహణలో నిలువెత్తు నిర్లక్ష్యం కనిపిస్తుంది. ఎంపీడీవో కార్యాలయం భవనం రెండు అంతస్తులతో సుమారు 15 సంవత్సరాల కిందట నిర్మించారు. భవనంపైన మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. దీంతో భవనం బీటలు వారే ప్రమాదం ఉంది. చిన్న మొక్కలు గా ఉన్నప్పుడు తొలగించకపోతే మానులుగా మారిన తరువాత తొలగించడం కష్టంగా మారుతుంది. ఇప్పటికైనా మండల పరిషత్ అధికారులు స్పందించి భవనం దెబ్బతినక ముందే మొక్కలు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.


అద్దంకి ఎంపీడీవో కార్యాలయంపై పెరిగిన మొక్కలు

మద్యం దుకాణాలా..బార్‌లా?

» నిబంధనలకు పాతర
» పట్టించుకోని అధికారులు

చీరాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పలు మద్యం దుకాణాల నిర్వాహకులు వైన్ షాపుల వద్ద అనధికారిక పర్మిట్ రూములను ఏర్పాటు చేశారు. ఆయా దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసిన వ్యక్తులు దుకాణ నిర్వాహకులు ఏర్పాటు చేసిన రూములలో మద్యం సేవిస్తున్నారు. ఇది అందరికీ కనిపిస్తున్న బహిరంగ రహస్యం. అయితే ఎక్సైజ్ అధికారులకు మాత్రం కనిపించడం లేదు. మద్యం దుకాణాల నిర్వాహకులు అందించే మామూళ్ల మత్తులో ఆ అధికారులకు సిట్టింగ్ రూములు కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మద్యం దుకాణాలా.. లేక బార్‌లా అని ప్రశ్నిస్తున్నారు. చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 24 మద్యం దుకాణాలు ఉన్నాయి. సుమారు 18 మద్యం దుకాణాలకు సంబంధించి అనధికారికంగా ఆయా దుకాణాల వద్ద సిట్టింగ్ రూములు ఏర్పాటు చేశారు. దీంతో కొన్ని చోట్ల గలాటాలు కూడా జరుగుతున్నాయి. వీటిపై ఎక్సైజ్, లా అండ్ ఆర్డర్ పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టపోవడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా వుంటే కొన్ని మద్యం దుకాణాల వద్ద అవసరమైతే అనధికారిక సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసుకోండి, మామూళ్లు మాకు ఇవ్వండని కొందరు అధికారులు ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే పంథాలో ఆ దందా సాగితే ప్రభుత్వానికి అపప్రద రాక తప్పదని చెప్పడంలో సందేహం లేదు.


ఈపురుపాలెంలో మద్యం దుకాణం వెనుక ఏర్పాటు చేసిన రూమ్‌లో తాగుతున్న దృశ్యం


వేటపాలెంలో వైన్ షాపు వద్ద ఏర్పాటు చేసిన రూంలో మద్యం సేవిస్తున్న మందుబాబులు

ఐక్యంగా సమస్యలను పరిష్కరించుకుందాం

» ప్రభుత్వ చేయూతను అందిపుచ్చుకుందాం
» రొయ్యరైతుల సంక్షేమ సంఘ ప్రతినిధుల ఉద్ఘాటన
» వచ్చే ఆదివారం మరలా సమావేశమవుదామని తీర్మానం


సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

వేటపాలెం(చీరాల), జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా సాగుచేసే రైతులు అందరం ఐక్యంగా ఉందాం.. సమస్యలను పరిష్కరించుకుందాం.. ప్రభుత్వ చేయూతను అందిపుచ్చుకొని అందుకు అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుని అడుగులు వేద్దామని కుందేరు, స్ట్రయిట్ కట్ రొయ్య రైతుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఉద్ఘాటించారు. స్థానిక కుందేరు స్ట్రయిట్ కట్ సమీపంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం రొయ్య రైతుల సంక్షేమ సంఘం ప్రతనిధులు, సభ్యుల సమావేశం జరిగింది. సంఘ అధ్యక్షుడు తేళ్ల రామయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘ గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, సంఘ కార్యదర్శి ఆమంచి శ్రీనివాసరావు (స్వాములు) తదితరులు మాట్లాడుతూ సంఘ పరిధిలో సుమారు 1700 ఎకరాల విస్తీర్ణంలో రొయ్యల సాగు జరుగుతోందన్నారు. ఆ క్రమంలో రొంపేరు పూడిక తీత పనులు, ప్రస్తుతం సాగులో ఉన్న విస్తీర్ణం, పూడిక తీత నేపథ్యంలో సాగులో ఏర్పడే అంతరాలు, అందుకు సాగుదారులు సహకరించాల్సిన బాధ్యతలు, ప్రభుత్వ పరంగా సమకూరాల్సిన వనరులు, చేయూత గతం, వర్తమానం, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. దీర్ఘకాలంగా జరుగుతున్న సాగు, స్వీయ అనుభవాలు, ఎదురైన సవాళ్లు, సానుకూల, ప్రతికూల పరిస్థితులను విశ్లేషించారు. క్రీక్‌లలో పూడిక తీత, తరువాత పూడికలు ఏర్పడకుండా చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేకంగా చర్చించారు. ప్రభుత్వ పరంగా అందే రాయితీలు, ఎన్ని ఎకరాలలోపు రైతులుకు ఏఏ రాయితీలు ఉంటాయనే అంశంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. చెరువుల యజమానులు, కౌలుదారుల మధ్య ఉండాల్సిన అవగాహనపై ప్రత్యేకంగా చర్చించారు. అర ఎకరం చెరువు ఉన్న రైతు అభిప్రాయాన్ని కూడా పరిగణలోకి తీసుకుందామన్నారు. యజమాని బాగుంటేనే కౌలుదారు బాగుంటాడని, అందుకు పలు ఉదాహరణలను పేర్కొన్నారు. వచ్చే ఆదివారం తిరిగి సమావేశమై పూర్తి స్థాయిలో ఆక్వా చెరువుల యజమానులు హాజరయ్యే విధంగా కార్యాచరణ రూపకల్పనకు దిశానిర్దేశం చేశారు. నిర్దిష్టమైన నిర్ణయాలు తీసుకుని వాటి అమలుకు అడుగులు వేద్దామని తీర్మానించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పల్లపోలు శ్రీనివాసరావు, భాస్కరరెడ్డి, చెరువుల యజమానులు, పలువురు కౌలుదారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

మార్టూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కమిటీ అధ్వర్యంలో సోమవారం విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సభ్యులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత సేవలు అందిస్తారని తెలిపారు. ఆరోగ్య శ్రీ కార్డులతో శిబిరానికి రావాలని సూచించారు.

13న ద్రోణాదులలో షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు

మార్టూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో ఈ నెల 13వ తేదీన ఇండోర్ ప్రాంతీయ షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలను (నాన్‌మెడలిస్ట్) ప్రారంభించనున్నట్లు గ్రామ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నామని, 45 ఏళ్లలోపు, 45 ఏళ్ల పైబడిన వారు పోటీలకు అర్హులని పేర్కొన్నారు. ప్రతి విభాగంలో మొదటి, రెండవ, మూడవ బహుమతులుగా రూ.8001, రూ.5001 రూ.3001 అందజేస్తారని ప్రకటించారు. ఈ పోటీలకు మార్టూరు, అద్దంకి, కొరిశపాడు, జె పంగులూ రు, యద్దనపూడి, ఇంకొల్లు, పర్చూరు, కారంచేడు, చీరాల, వేటపాలెం మండలాలవారు పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 9959576009, 9959900747 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ప్రమాదకరంగా బ్రిడ్జిలు

» పట్టించుకోని అధికారులు
» ఆందోళనలో ప్రయాణికులు

చీరాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : 216 జాతీయ రహదారిపై పలు చోట్ల బ్రిడ్జిల వద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆయా ప్రదేశాల్లో సీసీ రోడ్డులో ఇనుప చువ్వలు వెలుపలకి వచ్చాయి. ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా సంబంధిత 216 జాతీయ రహదారి పర్యవేక్షణ కాంట్రాక్ట్ బృందం ఆవైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో ప్రధానంగా చీరాల మండలం ఈపురుపాలెం బ్రిడ్జి పైన, చినగంజాం మండలం బ్రిడ్జి పైన ఏర్పడిన గోతులు, వెలుపలకు వచ్చిన ఇనుప చువ్వలతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆయా గుంతల వద్ద పక్క నుంచి వెళ్లే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక ఆయా చువ్వలు బయటపడ్డ ప్రదేశాల్లో బైక్‌లపై రాకపోకలు సాగించే వ్యక్తులు పలు సందర్భాల్లో సదరు బ్రిడ్జిల పైన వెలుపలకు వచ్చిన ఇనుక సువ్వలపై ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఈపురుపాలెం బ్రిడ్జిపై గుంతలు ఏర్పడి వెలుపలకు వచ్చిన ఇనుప చువ్వలు